కోటను సుందరంగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే



తీగ మార్గం వెళ్లే స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, కలెక్టర్ హన్మంత్ కె.జెండగే, టూరిజం జీఎం మందడి ఉపేందర్‌రెడ్డి, అధికారులు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: భువనగిరి కోటను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కోట అభివృద్ధి నిర్మాణాలకు ఇప్పటికే రూ.55 కోట్లు మంజూరయ్యాయని, వీటిని వినియోగించిన వెంటనే మరో రూ.34 కోట్లు మంజూరవుతాయని అన్నారు. కోట చుట్టూ నాలుగు వరసల రోడ్డు నిర్మించడం వల్ల రహదారి సదుపాయం ఏర్పడుతుందన్నారు. కోట పరిసరాల్లో రెస్టారెంట్లు, పర్యాటకులు సేదతీరే నిర్మాణాలు ప్రతిపాదించారన్నారు. కోట చరిత్ర తెలిపేందుకు ప్రదర్శనశాల, లైబ్రరీలు, సౌండ్ అండ్ లైట్‌షో నిర్మాణం చేపడతామన్నారు. యాదాద్రి, కొలనుపాకతో పాటు కోటను అభివృద్ధి చేయడం వల్ల పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు అవుతుందని వివరించారు. ఖేలో ఇండియా పథకం నిధులు సాధించి అనువైన ప్రాంతాల్లో స్టేడియాలు నిర్మించాల్సి ఉందన్నారు. రాయగిరిలో పదెకరాలతో మల్టీపర్పస్ స్టేడియం నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించాలని కలెక్టర్ హన్మంత్ కె.జెండగే ఆదేశించారు. సమావేశంలో టూరిజం జీఎం మందడి ఉపేందర్‌రెడ్డి, పుర అధ్యక్షుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ రామాంజుల రెడ్డి పాల్గొన్నారు.

తీగమార్గం స్థల పరిశీలన

భువనగిరి కోటపైకి నిర్మించనున్న తీగ మార్గం స్థలాన్ని బుధవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. తీగ మార్గం లోలెవల్, హైలెవల్ స్టేషన్లు నిర్మించే ప్రదేశాలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కోటపైన 34 మీటర్ల ఎత్తులో తీగ మార్గం ఉంటుందన్నారు. 300 మీటర్లకు ఒకటి చొప్పున ఐదు, ఏడు టవర్లు నిర్మించే అవకాశం ఉందని టూరిజం జీఎం మందడి ఉపేందర్ రెడ్డి వివరించారు. కోట అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రధాని మోదీ ప్రారంభించి ఆరు నెలలు గడుస్తున్నప్పటికి పనులు ప్రారంభించకపోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణాలను త్వరితగతిన ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. తీగ మార్గం నిర్మాణానికి కొంత భూమిని సేకరించాల్సి ఉందని అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు.

యాదాద్రిలో..
కార్తిక మాసోత్సవాలకు సన్నాహాలు



యాదగిరిగుట్టలో వ్రత మండపం వద్ద ఏర్పాట్లు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: హరిహరులకు ప్రీతికరమైన మాసం కార్తికం. వైష్ణవ, శైవ ఆరాధకులు అత్యధిక సంఖ్యలో హరి, హరులను దర్శించుకొని పూజలు చేపడతారు. పుణ్యస్నానం, దీపారాధన, తులసీ పూజ, శ్రీసత్యనారాయణస్వామి వ్రత నిర్వహణతో పాటు ప్రదక్షిణ మొక్కులు తీర్చుకుంటారు. ప్రముఖ వైష్ణవ క్షేత్రమే అయినా.. యాదాద్రిలో శివాలయం నిత్య పూజలతో శైవ ఆరాధకులను ఆధ్యాత్మికతను అందిస్తోంది. వచ్చే నెల 2 నుంచి మొదలయ్యే కార్తిక మాసోత్సవాల నిర్వహణకు హరిహర క్షేత్రమైన యాదాద్రి వివిధ ఏర్పాట్లతో సంసిద్ధమవుతోందని ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

సామూహిక వ్రతాలు..

యాదాద్రి క్షేత్రంలో సామూహికంగా శ్రీసత్యనారాయణస్వామి వ్రతాల నిర్వహణకు కొండకింద ఆధ్యాత్మిక వాడలోని వ్రత మండపాన్ని తీర్చిదిద్దే పనులు మొదలయ్యాయి. 600 వ్రత పీటలను సిద్ధం చేస్తున్నారు. వ్రత మండపం వద్ద సిమెంట్ ఫ్లోరింగ్, టైల్స్ వేసే పనులను వైటీడీఏ ద్వారా చేపట్టారు. ఇంకా అవసరమయ్యే వసరుల కల్పనకు నిర్ణయించారు.

పుణ్యస్నానాలు..

కార్తిక ఆరాధనలో పాల్గొనేందుకు ముందస్తుగా భక్తులు పుణ్యస్నానాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తారు. ఇందుకు కొండకింద లక్ష్మి పుష్కరిణిలో అవసరమయ్యే వసరుల ఏర్పాట్లు చేపట్టేందుకు దేవస్థానం సివిల్ విభాగం బాధ్యత వహించనుంది. కొండపైన విష్ణు పుష్కరిణిలో దంపతుల స్నాన సంకల్పానికి ఏర్పాట్లు చేశారు.

★ కార్తిక దీపారాధనకు కొండపైన ప్రధాన ఆలయ మాడ వీధిలో, శివ సన్నిధితో పాటు కొండకింద లక్ష్మి పుష్కరిణి చెంత నిర్వహణకు ఏర్పాట్లు త్వరలోనే చేపడతారు.

అన్న ప్రసాదం..

క్షేత్రసందర్శనకు వచ్చే భక్తులకు స్వామి అన్నప్రసాదం నూతన భవనంలో కల్పించేందుకు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం వెయ్యి మందికి అందజేస్తున్న అన్నప్రసాదాన్ని కొత్త భవనంలో మరో వెయ్యి మంది భక్తులకు పెంచి నిత్యం రెండు వేల మంది భక్తుల ఆకల్ని తీర్చేందుకు దేవస్థానం నడుం బిగిస్తోంది.

★ ప్రసాదాల కొనుగోలుకు భక్తులు ఇక్కట్లు పడకుండా అదనపు కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. కొండపై బస్‌స్టేషన్, కొండ కింద ఆధ్యాత్మిక వాడలోని బస్‌స్టేషన్‌లో కౌంటర్లు ఏర్పాటవుతాయి.

సన్నాల కొనుగోళ్లలో సాంకేతికత



రేణికుంట శివారులోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు (పాతచిత్రం)

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే :

ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా దశలవారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా గతంలో కంటే భిన్నంగా రాష్ట్ర సర్కారు ఈ సారి సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ప్రకటించింది. ఇందుకు ప్రత్యేక కేంద్రాలను ప్రారంభించడమే కాకుండా సాంకేతికత ఆధారంగా ధాన్యం కొనుగోళ్లకు చర్యలు తీసుకుంటోంది. ఈ విషయమై ఇప్పటికే సంబంధిత కేంద్రాలకు ఆయా సాంకేతిక పరికరాలు వచ్చి చేరాయి. వీటి ద్వారా సన్నరకం ధాన్యం తేమ, తాలు, గింజల పరిమాణం తదితర అంశాలను సులువుగా తెలుసుకునే వీలు కలుగుతుంది.

గింజలు తీయడానికి 'ప్యాడి హస్కల్'..

శాఖాపరంగా ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి రెండు ప్యాడి హస్కల్ యంత్రాలను అందజేయనున్నారు. గుప్పెడు వడ్లు తీసుకుని ఈ యంత్రంతో పోసి తిప్పితే పొట్టు ఊడిపోయి బియ్యం గింజలు బయటకు వస్తాయి. ఈవిధంగా బయటకు వచ్చిన బియ్యం గింజలను గ్రెయిన్ కాలిపర్ యంత్రంలో పోసి సన్నరకం బియ్యం అవునో.. కాదో.. తెలుసుకునే వీలు కలుగుతుంది.

'గ్రెయిన్ కాలిపర్'తో గుర్తింపు..

సన్నధాన్యం గుర్తించేందుకు ప్రతి కొనుగోలు కేంద్రానికి గ్రెయిన్ కాలిపర్ (డయల్ మైక్రో మీటర్) యంత్రం అందజేస్తున్నారు. ఈ యంత్రం సాయంతో సన్నబియ్యం గింజ పొడవు, వెడల్పు కొలుస్తారు. పొడవు 6 మిల్లీమీటర్ల కంటే తక్కువ, వెడల్పు 2 మి.మీ కంటే తక్కువ ఉండాలని ప్రమాణాలు నిర్దేశించారు. ఈ యంత్రం వినియోగంపై కేంద్రాల నిర్వాహకులకు ఇప్పటికే అవగాహన కల్పించినట్లుగా సంబంధిత అధికారవర్గాలు వెల్లడించాయి.

◆ కేంద్రాల్లో పారదర్శకతకు అవకాశం

సంచులపై కోడ్..

ధాన్యం సంచులపై కొనుగోలు కేంద్రం కోడ్, ధాన్యం రకం వివరాలు నమోదు చేస్తారు. సన్న రకమైతే ఎరుపు రంగుతో కొనుగోలు కేంద్రం నంబరు, ధాన్యం రకం వద్ద 'ఎస్' అని రాస్తారు. దొడ్డు రకం సంచులపై ఆకుపచ్చ రంగుతో కొనుగోలు కేంద్రం నెంబరు, ధాన్యం రకం వద్ద 'డీ' అని రాస్తారు. సన్న రకాన్ని సంబంధిత ఏఈవోలు ధ్రువీకరించాల్సి ఉంటుంది.

సంబంధిత రైతులు ఐరిస్..

రైతుల నుంచి దళారులు తక్కువ ధరకు ధాన్యాన్ని కొని, వాటిని కొనుగోలు కేంద్రాల్లో భారీగా విక్రయిస్తుంటారు. దీన్ని నిలువరించేందుకు ప్రభుత్వం ఐరిస్ విధానం అందుబాటులోకి తెచ్చింది. ఇదివరకు కేంద్రానికి వచ్చే వారి వివరాలను నిర్వాహకులు నమోదు చేసి, చరవాణికి ఓటీపీ పంపించేవారు. ధాన్యం విక్రయ సమయంలో మరో సారి ఓటీపీ పంపి ట్రక్‌షీట్‌ను కేటాయించిన మిల్లులకు పంపేవారు. ఈసారి ముందుగా రైతు వివరాలు నమోదు చేసుకుని ఓటీపీ పంపి, విక్రయ సమయంలో సంబంధిత రైతు ఐరిస్ తీసుకోనున్నారు.

ఈ సీజన్‌లో సన్నరకం ధాన్యం సాగు వివరాలు ఎకరాల్లో.. (అంచనా)

సన్నరకం సాగు	జిల్లా	దిగుబడి
2,42,490	నల్గొండ	5,81,975
3,41,650	సూర్యాపేట	8,15,960
97,028	యాదాద్రి	1,74,650

ఈ రకాలకే పంట బోనస్

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించింది. ఏ రకం వంగడాలకు బోనస్ వర్తిస్తుందనే సందేహాలు రైతుల్లో ఉన్నాయి. సర్కారు గుర్తించిన సన్నరకం వంగడాలు ఇవే.

సాంబమసూరి(బీపీటీ-5204)	జగిత్యాల సన్నాలు(జేజీఎల్-1798)
సిద్ధి(డబ్ల్యూజీఎల్-44)	జగిత్యాల సాంబ(జేజీఎల్3844)
కంపసాగర్-1(కేపీఎస్-2874)	కరీంనగర్ సాంబ(జేజీఎల్-3855)
జగిత్యాల-3(జేజీఎల్--27356)	అంజన(జేజీఎల్-11118)
జగిత్యాల-2(జేజీఎల్-28545)	నెల్లూరు మసూరి(ఎన్ఎల్ఆర్-34449)
వరంగల్ సాంబ(డబ్ల్యూజీఎల్-14)	ప్రత్యూమ్న(జేజీఎల్-17004)
వరంగల్ సన్నాలు(డబ్ల్యూజీఎల్-32100)	సుగంధ సాంబ(ఆర్ఎన్ఆర్-2465)
జగిత్యాల మసూరి(జేజీఎల్-11470)	శోభిని(ఆర్ఎన్ఆర్-2354)
పలాస ప్రభ(జేజీఎల్-384)	సోమనాథ్(డబ్ల్యూజీఎల్-347)
కృష్ణ (ఆర్ఎన్ఆర్-2458)	ఆర్ఎన్ఆర్-31479(పీఆర్ఫీ)
మానేరు సోనా(జేజీఎల్-3828)	కె.పి.ఎస్-6251(పీఆర్ఫీ)
తెలంగాణ సోనా(ఆర్ఎన్ఆర్-15048)	జేజీఎల్-33124(పీఆర్ఫీ)
వరంగల్ వరి-1119	హెచ్ఎంటీ సోనా
కూనారం వరి-2(కేఎల్ఎం-1638)	మారుటేరు సాంబ(ఎంటీయూ-1224)
వరంగల్ వరి-2(డబ్ల్యూజీఎల్-962)	మారుటేరు మసూరి(ఎంజీయూ-1262)
రాజేంద్రనగర్ వరి-4(ఆర్ఎన్ఆర్-21278)	ఎంటీయూ-1271
కూనారం వరి-1(కేఎల్ఎం-733)	

నినాదాలు.. నిరసనలు



రామన్నపేటలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటుపై నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న అదనపు కలెక్టరు బెన్‌షాలోమ్

ఈనాడు, నల్గొండ – రామన్నపేట, న్యూస్‌టుడే: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటుపై బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఎన్జీవోలు, స్వచ్ఛంద సంస్థల పేరిట స్థానికేతరులను రప్పించారనే సమాచారంతో అఖిలపక్ష నాయకులు వారిని గుర్తించి వెనక్కి పంపించారు. ఈ సమయంలో కొంత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కంపెనీ ఏర్పాటు చేయొద్దని, అభిప్రాయ సేకరణలో స్థానికులకే అవకాశం ఇవ్వాలని నాయకులు ఆందోళన చేశారు. అదనపు కలెక్టరు బెన్‌షాలోమ్ ఆందోళనకారులకు సర్దిచెప్పారు.

★ ప్రారంభంలో కంపెనీ ప్రతినిధులు ప్రసంగించే ప్రయత్నం చేయగా.. అఖిలపక్ష నాయకులతో పాటు మహిళలు, యువకులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. సంస్థ ప్రతినిధి భాస్కరరావు పరిశ్రమ ఏర్పాటు లక్ష్యాన్ని వివరిస్తూ.. రూ.1400 కోట్ల వ్యయంతో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును ప్రతిపాదించామని, ముడి సరకంతా దూర ప్రాంతాల నుంచి తీసుకువస్తామని, ఇక్కడ గ్రైండింగ్ మాత్రమే జరుగుతుందని, ఎలాంటి కాలుష్య సమస్య ఉండదని చెప్పారు. పరిశ్రమ ఏర్పాటు అయితే 180 మందికి ఉద్యోగాలు లభిస్తాయని.. నిర్మాణ సమయంలో 1500-2000 మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. అనంతరం అదనపు కలెక్టరు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. కొంతమంది నల్ల దుస్తులు ధరించి, మరికొందరు అర్ధ నగ్న ప్రదర్శనలతో తమ నిరసన తెలియజేశారు.

★ రామన్నపేటలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దని, డ్రైపోర్టు ఏర్పాటుకు భూసేకరణ చేసి ఇప్పుడు సిమెంటు పరిశ్రమ ఏర్పాటు చేయడం సమర్థనీయం కాదని ఎమ్మెల్సీ కోటిరెడ్డి అన్నారు. ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే సిమెంటు పరిశ్రమ ఏర్పాటుకు తాము వ్యతిరేకమని, కొత్తగా కాలుష్యాన్ని వెదజల్లే సిమెంటు పరిశ్రమను ఏర్పాటు చేస్తే ప్రజారోగ్యంతో పాటు వ్యవసాయ రంగం, చేతి వృత్తులు నిర్వీర్యం అవుతాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.డి. జహంగీర్ అభిప్రాయపడ్డారు. రామన్నపేటలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటుతో వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతింటుందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు, సిరిపురం గ్రామానికి చెందిన మేక అశోక్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమ ప్రజల జీవనవిధానంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు.

★ ప్రజల అభిప్రాయాలను రికార్డు చేశామని, సంబంధిత నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని అదనపు కలెక్టరు షాలోమ్ ప్రకటించడంతో సమావేశం ముగిసింది. అనంతరం బెన్‌షాలోమ్ వాహనాన్ని స్థానికులు అడ్డుకొని నివేదిక బహిర్గతం చేయాలన్నారు. పోలీసులు వారిని చెదరగొట్టారు. డీసీపీ రాజేశ్‌చంద్ర, అదనపు డీసీపీ లక్ష్మినారాయణ శాంతిభద్రతలను పర్యవేక్షించారు. 10 మంది సీఐలు, 20 మంది ఎస్సైలు, 200మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏసీపీలు మధుసూదన్‌రెడ్డి, రవికిరణ్‌రెడ్డి, సీఐ ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్సై పి.మల్లయ్య పాల్గొన్నారు. చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి అధికారి సంగీత, నర్సింహ, జల్లెల పెంటయ్య, వెంకట రాజిరెడ్డి, మల్లేశం, మహేందర్‌రెడ్డి, మల్లేశం, శ్రీనివాస్, ఎం.ఏ.మజీద్, నర్సింహ, గోదాసు శిరీష, గంగుల రాజిరెడ్డి పాల్గొన్నారు.



సిమెంటు పరిశ్రమ ఏర్పాటు చేయొద్దని ప్రజాభిప్రాయ సేకరణలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న మహిళలు

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై దృష్టి

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకులు సాధించేందుకు పురపాలికలు దృష్టి సారిస్తున్నాయి. గతంలో కంటే మెరుగ్గా రాణించేలా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరు డబ్బాల్లో వేసి ఇవ్వాలని ప్రజలకు సూచించినా.. పురపాలికల్లో 40 నుంచి 50 శాతమే ఇలా ఇస్తున్నారు. తద్వారా ఉత్తమ ర్యాంకుల సాధనలో వెనుకబడిపోతున్నారు. ఈ ఏడాది అలాంటి విధానానికి భిన్నంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మరుగుదొడ్లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇవి డిసెంబరు వరకు కొనసాగనున్నాయి.



స్వచ్ఛసర్వేక్షణ్ లో భాగంగా సూర్యాపేటలోని సద్దుల చెరువు వద్ద స్వచ్ఛతా హీ కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైద్యకళాశాల విద్యార్థులు

వార్డుల వివరాలు	పురపాలికలు	వార్డులు
సూర్యాపేట	5	141
నల్గొండ	8	171
యాదాద్రి	6	104

డబ్బాలో వేయాలని నిర్దేశించనున్నారు. పురపాలికల్లోని ప్రధాన రోడ్ల వెంబడి హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇంట్లో ఉత్పత్తి అయిన చెత్తాచెదారాన్ని రోడ్లపై, ఖాళీ స్థలాల్లో పారేయకుండా అవగాహన కల్పిస్తారు. పరిసరాల శుభ్రతపై పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వార్డుల వారీగా కార్యక్రమాలు..

ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికల్లో 419 వార్డుల వారీగా ఇక నుంచి చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తడి, పొడి చెత్తను ఎలా వేరుచేయాలో ప్రత్యేకంగా చూపించనున్నారు. భూమిలో కలిసిపోయే కూరగాయలు, ఇతర వ్యర్థాలు, కుళ్లిన పండ్లు, ఇంట్లో మిగిలిన ఆహార పదార్థాలను ఒక డబ్బాలో వేయాలని సూచించనున్నారు. ప్లాస్టిక్ డబ్బాలు, సీసాలు, ఇనుప ముక్కలు, కాగితాలు, అట్టలు ఇతర పొడి వ్యర్థాలను మరో

మెరుగైన ర్యాంకు సాధనకు కృషి..

– శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఈ సారి అవార్డు వచ్చేలా కృషి చేస్తాం. గతంలో కంటే మెరుగైన ర్యాంకు సాధించి సూర్యాపేట పురపాలికను రాష్ట్రస్థాయిలో నిలుపుతాం. పట్టణ ప్రజలు కూడా చెత్త విషయంలో నిబంధనలు పాటించి తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలి. పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తే ర్యాంకు తప్పక వస్తుంది.

ఎప్పుడు చూసినా తాళాలే

యాదగిరిగుట్టకు వెళ్లే మార్గం పక్కన వంతెన కింది ప్రజా మరుగుదొడ్లు నిర్మించారు. ఆలేరు, మోత్కూరు వైపు నుంచి యాదగిరిగుట్టకు వెళ్లే ప్రయాణికులు ఈ కూడలి వద్ద దిగి గుట్టకు వెళ్తుంటారు. ప్రయాణికులు, ప్రజల సౌకర్యార్థం పట్టణ ప్రగతి నిధులు రూ.6.50 లక్షల నిధులతో ఆధునిక సౌకర్యాలతో నిర్మించారు. వాటర్ ట్యాంక్ కూడా ఏర్పాటు చేశారు. మహిళలు, పురుషులకు విడివిడిగా కంపార్ట్‌మెంట్‌లు ఉన్నాయి. 7-10-2023న అప్పటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి దీన్ని ప్రారంభించారు. ప్రారంభించి ఏడాది గడుస్తున్నా ఏ ఒక్క రోజుకూడా తాళం తెరవలేదని స్థానికులు అంటున్నారు. పరిశీలించి వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఛైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు వివరణ ఇచ్చారు.

– న్యూస్‌టుడే, భువనగిరి, యాదాద్రి



రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం: కలెక్టర్



కొత్త సభ్యులకు గుర్తింపు పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ హన్మంత్ కె.జెండగే, అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరి, న్యూస్‌టుడే: గ్రామాల్లో పేదలు, వృద్ధులకు రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్ కె.జెండగే అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం భువనగిరిలోని హోటల్‌లో బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న హన్మంత్ కె.జెండగే మాట్లాడుతూ.. గ్రామాలు, పట్టణాల్లో రెడ్‌క్రాస్ సభ్యత్వాన్ని విస్తృతంగా పెంచాలన్నారు. గ్రామీణులకు మరిన్ని సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా శాఖ రక్తదాన శిబిరాలు నిర్వహించడంలో రాష్ట్రంలో ముందుండటం అభినందనీయమన్నారు. జిల్లా కేంద్రంలో రెడ్‌క్రాస్ భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. విశిష్ట అతిథులుగా పాల్గొన్న రెడ్‌క్రాస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ, సీఈవో ప్రొఫెసర్ శ్రీరాములు మాట్లాడుతూ.. యువత ముందుకొచ్చి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. కొత్తగా సభ్యులుగా చేరిన వారికి కలెక్టర్, అదనపు కలెక్టర్ గంగాధర్ గుర్తింపు పత్రాలు అందజేశారు. ట్రాఫిక్ నియమ, నిబంధనలపై రాచకొండ ట్రాఫిక్ ఏఎస్ఐ సోమనాథ్ వీడియో చిత్రాల ద్వారా, సీఆర్‌పీపై డాక్టర్ విజయకుమార్ అవగాహన కల్పించారు. సమావేశంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మహేందర్‌రెడ్డి, జిల్లా కోశాధికారి అంజయ్య, డివిజన్ అధ్యక్షులు సద్ది వెంకట్‌రెడ్డి, జిల్లా డైరెక్టర్లు హమీద్‌పాషా, అంజయ్య, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకటేష్, ఖలీల్, రమేష్, చారి, ప్రతినిధులు రామ్‌రెడ్డి, ఉపేందర్, స్పందన, డాక్టర్ జయశ్రీ, లావణ్య, కవిత, వెంకమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ధ్యేయం

'న్యూస్‌టుడే'తో ఎంజీయూ వీసీ ప్రొ.ఖాజా అల్తాఫ్ హుస్సేన్



ముఖాముఖి

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వారు ఉపాధి అవకాశాలు, ఉన్నత ఉద్యోగాలు సాధించేలా కృషి చేస్తామని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ. ఖాజా అల్తాఫ్ హుస్సేన్ పేర్కొన్నారు. తాను ఇక నుంచి వర్సిటీలోనే నివాసం ఉండి విశ్వవిద్యాలయ పురోగతికి తోడ్పడుతానని తెలిపారు. కొన్నేళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం పరిపూర్ణంగా ప్రయత్నాలు చేస్తామని పేర్కొన్నారు. త్వరలో వర్సిటీలో అన్ని విభాగాలపై సమీక్షలు జరిపి ఏమైనా లోపాలు ఉంటే వాటిని సవరిస్తామని పేర్కొన్నారు. ఇటీవల నూతన వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆయన 'న్యూస్‌టుడే'తో పలు విషయాలను పంచుకున్నారు..

బయోమెట్రిక్ పక్కాగా అమలు..

విశ్వవిద్యాలయంతో పాటు అనుబంధ కళాశాలల్లో బయోమెట్రిక్ విధానం పక్కాగా అమలు చేసే విధంగా చర్యలు చేపట్టనున్నాం. అధ్యాపకులు, విద్యార్థుల హాజరును మెరుగుపర్చేందుకు ఈ విధానం అమలు చేస్తున్నాం. విద్యార్థుల హాజరు 75శాతం కన్నా తక్కువగా ఉంటే వారిని పరీక్షలకు అనుమతించబోం.

విద్యార్థుల స్కిల్స్ పెంపుపై దృష్టి..

విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ఉద్యోగాలకు అవసరమయ్యే నైపుణ్యాలను నేర్పించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టనున్నాం. ప్రతి విద్యార్థి ఆంగ్ల భాషలో అనర్గళంగా మాట్లాడటం, ఇంటర్వ్యూలను ఎదుర్కొనేలా మనోధైర్యం కల్పించడం, వ్యక్తిగత సామర్థ్యాలు, బృందాన్ని నడిపించగల నైపుణ్యం, సాంకేతిక, విజ్ఞాన అంశాలు, తదితర ఎన్నో రకాల స్కిల్స్‌పై నిపుణుల ద్వారా శిక్షణ ఇప్పిస్తాం. ఆయా కంపెనీలతో సంప్రదింపులు చేస్తూ వారు విద్యార్థుల నుంచి ఏ నైపుణ్యాలు కోరుకుంటున్నారో తెలుసుకుని..అవే అంశాలను నేర్పించి కొలువులు సాధించేలా ప్రయత్నాలు చేస్తాం.

పరిశోధనలకు ప్రాధాన్యం..

వర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకుల పరిశోధనలకు అధిక ప్రాధాన్యం ఇస్తాం. వర్సిటీలో ఇప్పటి వరకు సుమారు 33 మంది ఆయా సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ పట్టాలు పొందారు. ఈ విద్యా సంవత్సరం వివిధ సబ్జెక్టుల్లో 62 మందికి అడ్మిషన్ ఇచ్చాం. ఇటీవల పీహెచ్‌డీ ప్రవేశాల ప్రక్రియ పూర్తయ్యింది. భవిష్యత్తులో ఎంజీయూ నుంచి పీహెచ్‌డీ పట్టాలు పొందే వారి సంఖ్య మరింత రెట్టింపు అయ్యే అవకాశాలు ఉన్నాయి.

నేను వర్సిటీలో ఉంటా...

విశ్వవిద్యాలయంలోని వీసీ రెసిడెన్సీలో నేను నివాసం ఉంటున్నాను. నిర్మాణం పూర్తయిన స్టాఫ్ క్వార్టర్స్‌లో అధ్యాపకులు ఉండేలా అన్ని రకాల ప్రయత్నాలు చేస్తాను. నేను స్థానికంగా ఉండడం ద్వారా వర్సిటీలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటుగా వర్సిటీ అభివృద్ధి చేసుకునేందుకు మంచి అవకాశంగా భావించవచ్చు.

పోస్టుల భర్తీకి ప్రయత్నిస్తాం..

ఎంజీయూలో గత కొన్నేళ్లుగా అధ్యాపక పోస్టులు సగం ఖాళీగా ఉన్నాయి. బోధనేతర విభాగాల్లో ఖాళీలు ఉన్నాయి. ఖాళీలు ఉన్నా విద్యార్థులకు ఉత్తమ విద్య అందిస్తూనే...వర్సిటీని అభివృద్ధి వైపు నడిపిస్తున్నాం. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో విషయాన్ని ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

యువ తేజం.. సేవా పథం

రామన్నపేట, న్యూస్‌టుడే:

సేవా పథం మా లక్ష్యం అంటున్నారు పలువురు యువకులు. చదువుతూ.. ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ సేవా మార్గం వైపు దృష్టి సారించారు. స్నేహితులతో కలిసి యువజన సంఘాలను ఏర్పాటు చేయడం, స్థాపించిన సేవా సంస్థల్లో సభ్యులుగా చేరడం ద్వారా ఆయా సంస్థల కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. పేదల ఆకలి తీరుస్తూ.. ఆర్థికంగా చేయూతనిస్తూ.. ఆధ్యాత్మిక సేవలు చేస్తూ ముందుకు సాగుతున్న పలువురు యువకులపై కథనం.

ఆకలి తీరుస్తున్న ఆపద్బాంధవులు

దయనీయ స్థితిలో ఉన్న పేదల ఆకలి తీర్చాలనే లక్ష్యంతో పోలీస్ ఉద్యోగి జబ్బు వెంకటేశ్ ఆపద్బాంధవులు ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు. సంస్థ లక్ష్యాన్ని తెలుసుకున్న మండలంలోని కక్కిరేణి తదితర గ్రామాలకు చెందిన పలువురు యువకులు ఇందులో సభ్యులుగా చేరారు. కుటుంబ పెద్ద దిక్కు కోల్పోయి ఇబ్బందులు పడుతున్న వారితో పాటు నిరుపేదల సమాచారం తెలుసుకుని వారి కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలు, కొంత ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు. ఇప్పటి వరకు దుబ్బాక, వెల్లంకి, నీర్నెంల, లక్ష్మాపురం, పల్లివాడ, మునిపంపుల తదితర గ్రామాల్లో 25కి పైగా కుటుంబాలకు సాయం అందించారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలని కుట్టుమిషన్లు పంపిణీ చేశారు.

ఆర్థికంగా చేయూతనిస్తూ..

నీర్నెంలలో కొందరు యువకులు జాంబవ మహాసేన అనే సేవా సంస్థను 2021లో ఏర్పాటు చేశారు. 74 మందితో ప్రారంభమైన ఈ సంస్థలో ప్రస్తుతం 139 మంది సభ్యులు ఉన్నారు. సొంతంగా నిధులు సమకూర్చి పిల్లలు లేని వృద్ధులు, పేదరికంతో ఇబ్బందులు పడుతున్న వారు, అనారోగ్యంతో గురై చికిత్స పొందుతున్న వారిని గుర్తించి ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ముందుకు వస్తున్నారు. రూ.10 వేలు నుంచి రూ.20వేలకు పైగా ఆర్థిక సాయం చేస్తున్నారు. ఇప్పటి వరకు రామన్నపేట, నీర్నెంల తదితర గ్రామాల్లో పదికి పైగా కుటుంబాలకు రూ.2లక్షలకు పైగా ఆర్థిక సాయాన్ని అందించామని సంస్థ సభ్యుడు నోముల యాదగిరి పేర్కొన్నారు.



నీర్నెంలలో ఆర్థికసాయం అందజేస్తున్న జాంబవ మహాసేన సభ్యులు

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుకుగా..

రామన్నపేట, నీర్నెంల, వెల్లంకి, సిరిపురం, బోగారం తదితర గ్రామాల్లో యువకులు సంఘాలను ఏర్పాటు చేసి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఒక్కో సంఘంలో 20మందికి పైగా సభ్యులున్నారు.



రామన్నపేటలో అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్న అన్నప్రసాద కమిటీ సభ్యులు

సేవల్లో ముందుండి.. వాసవీక్లబ్ గవర్నర్‌గా ఎదిగి



విజయలక్ష్మి

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: వాసవీ, వనితాక్లబ్‌ల ద్వారా జరిగే సేవా కార్యక్రమాలకు సహకారం అందిస్తూ అనతికాలంలో క్లబ్‌లో అంచెలంచెలుగా ఎదిగారు నేరేడుచర్లకు చెందిన రాచకొండ విజయలక్ష్మి. ఆమె సేవలను గుర్తించి వరంగల్ పట్టణంలో జరిగిన వాసవీక్లబ్ 104 రీజియన్ సమావేశంలో ఆమెను గవర్నర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు వాసవీ, వనితాక్లబ్‌ల ద్వారా పేదల కోసం నిర్వహించిన పలు సేవాకార్యక్రమాలకు రూ.10 లక్షలకు పైగా, వ్యక్తిగతంగా రూ.2 లక్షలు అందించినట్లు చెప్పారు. అప్పట్లో ఆటో మొబైల్ షాపు నిర్వహణలో పట్టు సాధించడంతో ఆర్యవైశ్య మహాసభ 2019లో ఆమెకు ఉత్తమ మహిళా వ్యాపారవేత్త అవార్డును అందించి సత్కరించింది. పేద విద్యార్థులకు, నిరుపేద మహిళలకు సాయం అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడల నిర్వహణకు ఆర్థిక సహకారం అందిస్తున్నారు.

☛ విజయలక్ష్మి వాసవీక్లబ్‌లో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. వాసవీక్లబ్ వైస్ గవర్నర్‌గా, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ కోశాధికారిగా, రీజియన్ ఛైర్పర్సన్‌గా, జోన్‌ఛైర్పర్సన్‌గా, నేరేడుచర్ల వాసవీ వనితాక్లబ్ తొలి అధ్యక్షురాలిగా పని చేశారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షురాలిగా, కార్యదర్శిగా పనిచేశారు. వైశ్యగురు సేవారత్న అవార్డును ఆమె అందుకోవడం విశేషం. ☛ రీజియన్‌లోని వాసవీ, వనితాక్లబ్‌ల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ముందు వరుసలో నిలిపేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

పర్యాటకుల్ని బుద్ధవనానికి తీసుకురండి: పటేల్ రమేశ్‌రెడ్డి

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: బుద్ధగయ నుంచి బౌద్ధ పర్యాటకులను సాగర్‌లోని బుద్ధవనానికి తీసుకురావాలని పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఏబీటీవో ఆధ్వర్యంలో బుద్ధగయలో నిర్వహించిన టూర్స్ ఆపరేటర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై.. మాట్లాడారు. ఆచార్య నాగార్జునుడు నడయాడి, మహాయన బౌద్ధాన్ని ప్రచలితం గావించి మాధ్యమిక బౌద్ధ తార్కిక విధానాన్ని ప్రచారం చేసిన ప్రాంతం నాగార్జునసాగర్ అన్నారు. అలాంటి ప్రాంతంలో బౌద్ధ సంస్కృతిని ఈ తరానికి తెలియజేయడానికి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన బుద్ధవనానికి పర్యాటకులను తీసుకురావాలని ఆయన కోరారు. అనంతరం బుద్ధవనం గురించి బుద్ధిస్ట్ నిపుణుడు ఈమని శివనాగిరెడ్డి ట్రావెల్ ఏజెంట్లకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఏబీటీవో జనరల్ సెక్రటరీ హంసహాలిడేస్ అధినేత కౌలేష్ కుమార్ బుద్ధగయ తదితరులు పాల్గొన్నారు.



ట్రావెల్ ఏజెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న పటేల్ రమేశ్‌రెడ్డి

క్రీడా స్ఫూర్తి పెంపొందించుకోండి

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థినులు పాఠశాల స్థాయి నుంచే క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని డీఎస్పీ రాజశేఖరరాజు అన్నారు. మండల పరిధిలోని శ్రీనివాసనగర్ గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పులే తెలంగాణ బీసీ సంక్షేమ బాలికల గురుకులాల సొసైటీల ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి క్రీడాపోటీలు దామరచర్ల పాఠశాల, జూనియర్ కళాశాలలో ఆయన బుధవారం ముఖ్యఅతిథిగా వచ్చి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థినులు గురుకులాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. ప్రిన్సిపల్ ఉమాదేవి, అసిస్టెంట్ ప్రిన్సిపల్ సరిత, విశ్రాంత ప్రిన్సిపల్ నర్సింహారెడ్డి, పీడీ ఇందిరా, పీఈటీ శాంతి, ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

◆ తొలిరోజు షాట్‌పుట్, డిస్క్ త్రో, కబడ్డీ, ఖో-ఖో క్రీడా పోటీలు నిర్వహించగా.. షాట్‌పుట్, డిస్క్‌త్రో పూర్తయ్యాయని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు.



వాలీబాల్ ఆడి క్రీడలు ప్రారంభిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

విజేతల వివరాలు..

షాట్‌పుట్: సీహెచ్. శ్రావ్య, అనంతగిరి పాఠశాల (మొదటి స్థానం), ఎ.అక్షిత, గుడుగుండ్లపాలెం పాఠశాల (ద్వితీయ).

డిస్క్‌త్రో.. కె.కీర్తి, అప్పాజీపేట పాఠశాల (మొదటి స్థానం), కె.సువార్త, సింగిరెడ్డిపాలెం పాఠశాల (ద్వితీయ).

పల్లెవించిన పంట..!

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: చదివింది వ్యవసాయ డిప్లొమా. ఉన్నత చదువులకు అమెరికాలో అడ్మిషన్ వచ్చింది. రూ.కోటి వరకు ఖర్చు వచ్చేలా ఉండటంతో అంత భారం కుటుంబంపై వద్దనుకున్నాడు. ఇదే అర్హతతో హైదరాబాద్‌లోని ఒక వ్యవసాయ క్షేత్రం మేనేజరుగా కుదిరాడు. ఉద్యోగంలో ప్రవేశించిన నెల రోజుల్లోనే చేదు అనుభవం ఎదురవడంతో ఇంటిదారి పట్టాడు. తమ భూమిని కాపాడుకుంటూనే ఆర్థిక వనరులు సృష్టించుకోవాలని సంకల్పించాడు. ఆ దారిలోనే ముందడుగు పడింది. అంతేకాదు.. తనలాగా ఎవరైనా సేంద్రియ సాగుపై ఆసక్తి చూపితే.. వారికీ ఉచితంగా శిక్షణనిప్పిస్తానంటున్న ఈ యువకుడి పేరు పల్లె భరత్‌రెడ్డి. స్వగ్రామం చింతలపాలెం.



సేంద్రియ పద్ధతిలో కాసిన కూరగాయలను చూపిస్తున్న యువరైతు భరత్‌రెడ్డి

ప్రయాణం సాగిందిలా..

సాగు పద్ధతులపై పట్టుకోసం ఒక క్షేత్రంలో ఉద్యోగంలో చేరా. అక్కడ వీడియోలు తీస్తుంటే ఉద్యోగం నుంచి తొలగించారు. పట్టణాల్లో మాదిరి మా ఇంటి దగ్గర సేంద్రియ వ్యవసాయంతో సంపాదించుకోవచ్చని ఇంటికొచ్చా. అరెకరంలో ప్రయోగాత్మకంగా కూరగాయల తోట వేశా. బావుంది. ప్రస్తుతం దొండ, ఎర్రబెండ, వంగ, సొర, బీర, పచ్చిమిర్చి పండిస్తున్నా. రెండ్రోజులకొకసారి పది కిలోల దిగుబడి వస్తుంది. ఏరోజుకారోజు కోసి వాట్సప్ గ్రూప్‌లో పెట్టగానే ఆర్డర్లొస్తుంది. అలవాటయ్యేందుకు హోం డెలివరీ ఇస్తున్నా. ఐదారు కిలోలైతే పది కిలోమీటర్ల వరకు వెళ్లి ఇస్తున్నా. పొలం దగ్గరకూ వచ్చి తీసుకెళ్తున్నారు. ఏదైనా మార్కెట్ ధరకే ఇస్తున్నా.



కూరగాయల తోటలో సొర, బీరకాయలు

సొంతూళ్లోనే ఉద్యోగంలా..

మా ఇంట్లో ఆవులు ఉన్నాయి. తోటలో మొక్కల ఎదుగుదలకు ఎరువుగా ఆవు పేడ వాడతా. ఇంకా డైరెక్టర్ ఆఫ్ ఆర్గానిక్ అగ్రికల్చర్ వారు తయారు చేసిన వేస్ట్ డీకంపోజరును తెచ్చుకున్నా. దాన్ని నీళ్లలో కలుపుకొని ఐదు రోజులు నిల్వ చేసి మొక్కల తొలి దశలో దాన్ని స్ప్రే చేస్తుంటా. నాణ్యమైన దిగుబడికి ఆవు పేడతోనే తయారు చేసిన ఘన జీవామృతాన్నీ వాడతా. తెగులు వస్తే నీమాస్త్రం చల్లుతా. సొంతూళ్లోనే ఉద్యోగంలాగా ఇలా సాగు చేసుకోవచ్చు. భూమిని రసాయనాల బారి నుంచి కాపాడుకోవచ్చు. ఆదాయం కూడా లభిస్తుంది. నేనూ ఈ లక్ష్యంతోనే చేస్తున్నా. ఫ్రెండ్స్ ఆర్గానిక్ ఫాం అని సామాజిక మాధ్యమ ఛానల్‌ను పెట్టా. నాలాంటి వారికి ఉచితంగానే శిక్షణనిప్పిద్దామనేది ఉద్దేశం.

నవంబరు మొదటి వారంలో బస్సు యాత్ర: జాజుల

నీలగిరి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కులగణన పూర్తి చేసేవరకు పోరాటం ఆపబోమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. బుధవారం బీసీ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ కులగణనను ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నవంబరు మొదటి వారంలో రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహిస్తామని చెప్పారు. కులగణనతోనే బీసీల భవిష్యత్తు ఉందన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. జీవో 29తో బీసీలకు మరింత నష్టం ఏర్పడిందన్నారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చక్రహరి రామరాజు, నేలపట్ల సత్యనారాయణ, శంకర్, రాములు, శంకరయ్యగౌడ్, భిక్షమయ్య, మధుయాదవ్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్



గవర్నర్ కలిసిన ఎంజీయూ వీసీ ప్రొ.అల్తాఫ్ హుస్సేన్, చిత్రంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం

గవర్నర్‌ను కలిసిన ఎంజీయూ వీసీ

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రొ.ఖాజా అల్తాఫ్ హుస్సేన్ బుధవారం హైదరాబాద్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంజీయూలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి తదితర అంశాలను వివరించారు. వర్సిటీని మరింత అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తామని ఆయనకు తెలిపారు. వీసీ వెంట తెలంగాణ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం ఉన్నారు.

ఎన్జీ కళాశాల పీజీ ఫలితాలు విడుదల

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: నాగార్జున ప్రభుత్వ కళాశాల పీజీ రెండో, నాలుగో సెమిస్టర్, ఒకటో, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ ఫలితాలను బుధవారం కళాశాలలో ప్రిన్సిపల్ ఉపేందర్, పరీక్షల నియంత్రణ అధికారి బి.నాగరాజు విడుదల చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్న అధ్యాపకులను అభినందించారు. రానున్న రోజుల్లో విద్యార్థులు మరింత మెరుగైన ఫలితాలు సాధించి కళాశాలను ఆదర్శప్రాయంగా మార్చాలని కోరారు. ఎమ్మెస్సీ జంతుశాస్త్రం, రసాయనశాస్త్రం, కంప్యూటర్ సైన్స్, ఎంకాం, ఎంఏ తెలుగు, అర్థశాస్త్రాలకు సంబంధించిన ఫలితాల వివరాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. ప్రసన్నకుమార్, వెల్దండి శ్రీధర్, రవికుమార్ పాల్గొన్నారు.



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపల్ ఉపేందర్, సీవోఈ నాగరాజు, తదితరులు

సాగర్ డ్యాం క్రస్టుగేట్ల ద్వారా నీటి విడుదల నిలిపివేత

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ డ్యాం క్రస్టుగేట్ల ద్వారా నీటి విడుదలను ఎన్నెస్పీ అధికారులు మంగళవారం అర్ధరాత్రి నుంచి నిలిపివేశారు. సాగర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో ఉన్న డ్యాం నుంచి వచ్చిన వరదనీటి కారణంగా ఎన్నెస్పీ ఈ నెల 16వ తేదీ నుంచి 23వ తేదీ అర్ధరాత్రి వరకు సాగర్ డ్యాం క్రస్టుగేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. ఎన్నెస్పీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు శ్రీశైలం నుంచి 78.4 టీఎంసీల వరదనీరు సాగర్ జలాశయానికి చేరగా క్రస్టుగేట్ల ద్వారా 53 టీఎంసీ, కుడి, ఎడమకాల్వ, ప్రధాన విద్యుత్‌కేంద్రం, ఎస్ఎల్బీసీ, వరదకాల్వ ద్వారా 25.7 టీఎంసీలు మొత్తం 80.77 టీఎంసీ నీటిని విడుదల చేయగా ప్రస్తుత జలాశయ నీటిమట్టం 589.40 అడుగుల వద్ద ఉంది.

భూ వివాదంలో అన్నను హత్య చేయించిన తమ్ముడు

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: భూ వివాదంతో సొంత అన్నను తమ్ముడు సుపారి గ్యాంగ్‌తో కిరాతకంగా హత్య చేయించిన ఘటన నల్గొండ జిల్లా మాడ్గులపల్లి మండలం నారాయణపురం గ్రామంలో ఈ నెల 16న చోటు చేసుకున్నట్లు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

★ గ్రామానికి చెందిన కాకునూరి నరసింహకు ముగ్గురు కుమారులు లింగయ్య, కొండయ్య(64), శ్రీను ఉన్నారు. 20 ఏళ్ల క్రితం కొండయ్య, శ్రీను కలిసి అన్న లింగయ్య పేరుతో ఆరు ఎకరాల భూమిని కొనుగోలు చేసి పట్టాచేశారు. కొద్దిరోజుల క్రితం లింగయ్య మరణించగా అతడి పేరిట ఉన్న భూమిని కాకునూరి శ్రీను పట్టా మార్పిడి చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న కొండయ్య గ్రామ పెద్దలు, బంధువుల వద్ద పంచాయితీ పెట్టించారు. దీంతో కాకునూరి శ్రీను తన అన్న కొండయ్యను అడ్డు తప్పించుకోవాలని భావించి పాత నేరస్థులు వేముల నాగరాజు, పందిరి లింగస్వామిలను సంప్రదించి రూ.5 లక్షలకు హత్యచేసేలా సుపారి ఇచ్చాడు.



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ వీరబాబు, ఎస్సై కృష్ణయ్య

★ సుపారి గ్యాంగు సభ్యులు కొద్దిరోజులుగా కొండయ్య కదలికలపై రెక్కీ నిర్వహించి ఈనెల 16న ఇంట్లో ఉన్న కొండయ్యను కత్తితో పొడిచి ఆటోలో ఎక్కించుకుని పోతుండగా గ్రామస్థులు అడ్డుకోగా అక్కడే కొండయ్యను పడేసివెళ్లారు. ఈ నెల 22న పోలీసులు హత్య కేసు నిందితులు కాకునూరి శ్రీను, వేముల నాగరాజు, పందిరి లింగస్వామి, చీరాల సురేష్, జిట్టబోయిన వెంకన్నలను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద ఆటో, 5 చరవాణులు, రూ.15వేల నగదు, కత్తి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపుతున్నామన్నారు. నేరస్థులను అదుపులోకి తీసుకున్న సీఐ వీరబాబు, ఎస్సై కృష్ణయ్య సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00



విద్యార్థులకు తుపాకీపై అవగాహన కల్పిస్తూ..



పోలీస్ డాగ్‌కు ఆహారం అందిస్తున్న విద్యార్థిని

ఆయుధాలు పరిశీలిస్తూ.. డాగ్‌ను లాలిస్తూ

పోలీసులు వాడే ఆయుధాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్పీ రాములునాయక్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌజ్‌లో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పోలీస్ ఆయుధాలు, బాంబు స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీం, కమాండ్ కంట్రోల్, సీసీ కెమెరాలు, మాదక ద్రవ్యాల కిట్లపై అవగాహన కల్పించారు. డీఎస్పీ రమేశ్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఆర్ఐ సంతోశ్ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, నల్గొండ అర్బన్

ముగ్గురిపై పోక్సో కేసు నమోదు

కోదాడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు వేధింపులకు గురి చేశారు. ఈనెల 12న సదరు బాలిక పాఠశాలకు వెళ్తున్న సమయంలో ముగ్గురు యువకులు అడ్డుకొని వీడియోలు చిత్రీకరించి బెదిరింపులకు పాల్పడ్డారు. బాలిక నుంచి రూ.700 నగదును చోరీ చేశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేపట్టి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

పశువుల వాహనం పేరిట వసూళ్లు..!

కోదాడ, న్యూస్‌టుడే: పశువులను అక్రమంగా కబేళాకు తరలిస్తుంటే ఆ వాహనాన్ని అడ్డుకొని సీజ్ చేసి పశువులను రక్షించాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. కానీ కొందరు పోలీసులు సంపాదనే ధ్యేయంగా పశువుల వాహనాన్ని పట్టుకొని అక్రమాలకు పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటన ఇటీవల కోదాడ డివిజన్ పరిధిలో చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. డివిజన్ పరిధిలోని ఓ పట్టణంలో ఈ నెల 17, 18 తేదీల్లో రాత్రి సమయంలో పోలీసులు వాహనంలో గస్తీ కాస్తున్నారు. అదే సమయంలో వాహనంలో కొందరు పశువులను తరలిస్తుండగా వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేయాల్సిన పోలీసులు వ్యాపారులతో బేరసారాలు ఆడినట్లు తెలిసింది. సీజ్ చేయకుండా రూ.లక్ష వరకు వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం. దాంట్లో రూ.30 వేలు ఆన్‌లైన్ విధానంలో చెల్లించినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. ఈ దందా ఎప్పటి నుంచో జరుగుతుందని, దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటేనే మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కావని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

మైనింగ్ కాంట్రాక్టు రద్దు చేయండి: సీపీఐ

వలిగొండ, న్యూస్‌టుడే: మైనింగ్ కాంట్రాక్టు రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం సొప్పరి వెంకటేశం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెడ్లరేపాక గ్రామ పరిధిలో మనియండ్లగుట్ట సర్వే నెం 580లో మైనింగ్ కాంట్రాక్టును ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. వన్యప్రాణులు, జాతీయ పక్షులు మయూరాలు పెరగడానికి, పశువులు, గొర్రెల కాపరులకు ఈ గుట్ట ఎంతో ఉపయోగపడుతోందన్నారు.


వలిగొండ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు

ప్రభుత్వ భూమికి హద్దులు ఏర్పాటు చేసి కాంట్రాక్టర్లను రానివ్వకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సీపీఐ పట్టణ కార్యదర్శిగా సుద్దాల సాయికుమార్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. కార్యక్రమంలో పోలేపాక యాదయ్య, ఎల్లంకి మహేశ్, మచ్చ లక్ష్మీనారాయణ, రవీందర్, సుదర్శన్, నరసింహ, గోరయ్య పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: కల్యాణలక్ష్మి, ఇతరత్రా వాటి దరఖాస్తులపై గెజిటెడ్ అధికారులు సంతకాలు చేయడం లేదని, లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వార్డు మాజీ సభ్యుడు చిత్తర్ల బాలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా సమస్య ఉందని, కలెక్టర్ చొరవ చూపి గెజిటెడ్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లుగా పేర్కొన్నారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులుండవ్

ముఖాముఖి

యాదగిరిగుట్ట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పద్మావతి



గ్రామాలలో పైపులైన్లు పగిలి నీరు కలుషితం అవుతుండటంతో ప్రజారోగ్యం దెబ్బతింటోంది. విలువైన నీరు కూడా వృథా అవుతోంది. మరమ్మతుల విషయంలో ఆలస్యం అవుతుండటంతో తాగునీటి సమస్య ఉత్పన్నమవుతోంది. వీటన్నింటిని నిశితంగా పరిశీలించిన ప్రభుత్వం ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. తాగునీటి నాణ్యత పరిశీలనతో పాటు బోర్లు, మోటార్లు పాడైతే అదే రోజు మరమ్మతులు జరిగేలా, పైపులైన్ల లీకేజీలను అరికట్టేందుకు గ్రామాలలో మంచి నీటి సహాయకులను నియమించింది. వీరికి శిక్షణ, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో యాదగిరిగుట్ట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ బి.పద్మావతితో 'న్యూస్‌టుడే' ముఖాముఖి వివరాలు మీకోసం..

– ఆలేరు, న్యూస్‌టుడే:

సబ్ డివిజన్ పరిధిలో...

యాదగిరిగుట్ట సబ్ డివిజన్ పరిధిలో ఆలేరు, తుర్కపల్లి, మోటకొండూరు, గుండాల, ఆత్మకూరు(ఎం), రాజపేట, బొమ్మలరామారం, యాదగిరిగుట్ట మండలాలు ఉన్నాయి. మొత్తం 141 గ్రామ పంచాయతీలకు సంబంధించి 165 మంది గ్రామ తాగునీటి సరఫరా సహాయకులకు శిక్షణ ఇస్తున్నాం.

శిక్షణ అంశాలు..

ప్రధానంగా నాలుగు అంశాలలో శిక్షణ ఇస్తున్నాం. మండల కేంద్రాలలో నాలుగు రోజులపాటు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశాం. రాజేంద్రనగర్‌లోని అపార్డ్‌లో శిక్షణ పొందివచ్చిన టీవోటీ(ట్రైనర్ ఆఫ్ ట్రైనీస్)ల చేత శిక్షణ, ప్రత్యక్ష అవగాహన తరగతులు చెప్పిస్తున్నాం. ప్రధానంగా నాలుగు అంశాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. సింగిల్‌ఫేజ్, త్రీఫేజ్ విద్యుత్తు మోటార్లకు మరమ్మతులు, చేతిపంపులు, బోరుబావుల మరమ్మతులు, పైపులైన్ల లీకేజీల మరమ్మతులు, మంచినీటి శుద్ధిపై శిక్షణ ఇవ్వడం జరుగుతోంది.

త్వరితగతిన సమస్యల పరిష్కారానికి..

గతంలో గ్రామాల్లో నీటి సరఫరా విషయంలో తలెత్తే సమస్యలు పరిష్కరించేందుకు మండల కేంద్రంలో ఉండే ఇద్దరు ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది రావాల్సి ఉండేది. పరిష్కారానికి చాలా సమయం పట్టేది. వీటన్నింటినీ అధిగమించేలా ఏర్పాటు చేస్తున్న మంచి నీటి సరఫరా సహాయకులు పంచాయతీకి ఒక్కరు చొప్పున ఉంటున్న నేపథ్యంలో తాగునీటి సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యే అవకాశం ఉంటుంది. ప్రజలకు స్వచ్ఛమైన మంచి నీరు అందుతుంది.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80082 78928 80085 74375

సంస్థాన్‌నారాయణపురం, న్యూస్‌టుడే:

? మండల కేంద్రంలోని బొడ్రాయి ప్రాంతంలో నీటి సరఫరా నిలిచిపోయింది. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కేవలం కృష్ణా జలాలు మాత్రమే వస్తున్నాయి. నీటిని సరఫరా చేసి సమస్య పరిష్కరించండి.
– శికిలమెట్ల వెంకటేశం(నారాయణపురం)

✔ బోరు మోటార్లు మరమత్తులు చేయించాం..నేటి నుంచి నీటి సరఫరా అవుతుంది. ఒకరిద్దరికి వస్తలేవని మా దృష్టికి వచ్చింది. వారి సంబంధించి పైప్‌లైన్‌లో ఏమైనా సమస్య ఉండొచ్చు. పరిశీలిస్తాం..
– శ్రీనివాస్(పంచాయతీ కార్యదర్శి)

అడ్డగూడూరు, న్యూస్‌టుడే:

? మండల కేంద్రంలోని పాతబస్టాండు సమీపంలో మురుగుకాలువలో చెత్తాచెదారం తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది.
– స్థానికుడు, అడ్డగూడూరు

✔ పంచాయతీ సిబ్బందితో మురుగు తొలగించి సమస్యను పరిష్కరిస్తాం. – నరేష్, పంచాయతీ కార్యదర్శి, అడ్డగూడూరు

పిల్లల దత్తతపై అవగాహన

తుర్కపల్లి, న్యూస్‌టుడే: జిల్లా మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో బుధవారం వాసాలమర్రి గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చట్టాలు, పిల్లల దత్తత అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, తల్లులు, బాలింతలు, గర్భిణులు హాజరయ్యారు. మహిళల హక్కులు, సాధికారత, లింగ వివక్షత, బాల్య వివాహాలు, గృహ హింస, పీసీపీఎన్డీటీ, పోక్సో, చిన్నారుల దత్తత చట్టాలపై అవగాహన కల్పించారు. పిల్లలను పోషించలేక దత్తత ఇవ్వాలనుకునే వారు సొంత నిర్ణయాలు తీసుకుని తెలిసిన వారికి ఇవ్వడం, విక్రయించడం నేరమని పేర్కొన్నారు. ఉమెన్, చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్లు 181, 1098, వృద్ధులకు 14567, సైబర్ నేరాలకు 1930 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు. సఖీ కేంద్రం అధికారి లావణ్య, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ప్రతినిధులు భార్గవి, నిఖిత, బాలల పరిరక్షణ కేంద్రం సామాజిక కార్యకర్త శ్వేత, మనీష, అంగన్‌వాడీ టీచర్లు సరిత, భాగ్య, పంచాయతీ కార్యదర్శి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని బలోపేతం చేయాలి


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం విద్యా రంగాన్ని బలోపేతం చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.సోమయ్య అన్నారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యారంగం బలోపేతానికి ప్రస్తుతం కేటాయించిన నిధులకు అదనంగా 20 శాతం కేటాయించాలని అన్నారు. సమీకృత గురుకులాలు, స్కిల్, క్రీడా యూనివర్సిటీల పేరిట గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం కమిషన్ నివేదిక రాకముందే నూతన విద్యావిధానం అమలు చేయడం సరికాదన్నారు. అన్ని తండాల్లో ప్రభుత్వ పాఠశాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి తన హామీని నిలుపుకోవాలని అన్నారు. సమావేశంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్తయ్య, రాష్ట్ర కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి, నాయకుల, సంస్థల ప్రతినిధులు శ్రీనివాస్, మల్లారెడ్డి, షేక్ హమీద్, జిట్టా భాస్కర్‌రెడ్డి, భాస్కర్, శివలింగం, శ్రీనివాసచార్యులు, సత్తయ్య, అనిత, రమాదేవి, శ్రీశైలం, శశికాంత్, దశరథ, రవి, జంగారెడ్డి పాల్గొన్నారు.

చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి కృషి

టీజీఐఐసీ ఛైర్మన్ నిర్మల జగ్గారెడ్డి

బీబీనగర్, న్యూస్‌టుడే: చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని టీజీఐఐసీ ఛైర్మన్ నిర్మల జగ్గారెడ్డి పేర్కొన్నారు. బీబీనగర్ మండలం రాయరావుపేటలోని ఇండస్ట్రియల్ పార్క్‌లో బుధవారం నిర్వహించిన ఇండస్ట్రీస్ ఓనర్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పరిశ్రమలను స్థాపించి స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. బీబీనగర్ ప్రాంత ప్రజలకు రాయరావుపేట ఇండస్ట్రియల్ పార్క్ ఉపాధికి కేరాఫ్‌గా నిలవనుందన్నారు. అధ్యక్షుడిగా బాలనర్సింహ్మాగౌడ్, ఉపాధ్యక్షుడిగా నర్సింహరెడ్డి, ప్రధానకార్యదర్శిగా నరేందర్‌రెడ్డి, కోశాధికారిగా నాగాచారి, జాయింట్ సెక్రిటరీగా గోవింద్ తివారి, ఆర్గనైజింగ్ సెక్రిటరీగా జ్యోతి మహేందర్‌రెడ్డి, అడ్వజర్లు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మొత్తం 14 మంది ప్రమాణస్వీకారం చేశారు. రాయరావుపేట ఇండస్ట్రియల్ పార్క్‌లో పూర్తిస్థాయి మౌలికసదుపాయాల కల్పన, స్థానికులకు ఉపాధి అవకాశాల కల్పనకు కృషిచేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో టీఐఎఫ్ అధ్యక్షుడు కొండవీటి సుధీర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి మురిపాల గోపాల్‌రావు, మాజీ ఎంపీపీ ఎర్కల సుధాకర్ గౌడ్, మాజీ సర్పంచి బొర్ర సంతోష రమేష్, ఎంపీటీసీ మాజీ సభ్యులు ఎర్కల విజయలక్ష్మీ పాండురంగంగౌడ్, జిల్లా నాయకులు పోట్టోల్ల శ్యామ్‌గౌడ్, నిఖిల్‌రెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.


సమావేశం మాట్లాడుతున్న టీజీఐఐసీ ఛైర్మన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డి

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: పురపాలిక పరిధిలోని లింగారెడ్డిగూడెం శివారులో బుధవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పంతంగికి చెందిన కడగంచి వెంకటయ్య చౌటుప్పల్‌లో జరిగిన బంధువుల వివాహానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఎస్.లింగోటం మీదుగా పంతంగికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. లింగారెడ్డిగూడెం శివారులోకి చేరుకోగానే తూర్పుగూడెంకు చెందిన మానె రవికుమార్ ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటయ్య, రవికుమార్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులకు తొలుత చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాద ఘటన జరిగిన ప్రాంతంను పోలీసులు సందర్శించి దర్యాప్తు చేస్తున్నారు.

రాగితీగ అపహరణ

మోటకొండూరు, న్యూస్‌టుడే: మోటకొండూరు ఆవాస గ్రామం రాయికుంటపల్లి మల్లగ గౌరయ్య వ్యవసాయక్షేత్రం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగితీగను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఈ ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. 25కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్‌లు తొలగించి అందులోని రాగితీగను దొంగిలించారు. విద్యుత్తు శాఖ ఎస్ఈ సిద్దేశ్వర్ ఇచ్చిన మేరకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పాండు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

తుర్కపల్లి, న్యూస్‌టుడే: తుర్కపల్లి మండలం వేల్పుపల్లి శివారులో బుధవారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రక్షణ లేకపోవడంతో జంగంపల్లి గ్రామానికి చెందిన మాటూరి వినయ్‌గౌడ్‌కు చెందిన ఆవు అటుగా వెళ్లి విద్యుదాఘాతంతో మృత్యువాత పడింది.

పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: బొల్లేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను ఎంపీడీవో శ్రీనివాస్ బుధవారం సందర్శించారు. 'ఈనాడు'లో 'కూలిన పాఠశాల భవనం.. విద్యార్థులకు తప్పిన ప్రమాదం' శీర్షికన కథనం బుధవారం ప్రచురితమైంది. జడ్పీ సీఈవో శోభారాణి ఆదేశాల మేరకు పాఠశాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఇక్కడ అసంపూర్తి నిర్మాణంలోని అదనపు తరగతిగదిని పరిశీలించి పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. భవనానికి సంబంధించిన పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు ఎంపీడీవో చెప్పారు. ఈయన వెంట ఎంపీవో దినకర్, ప్రధానోపాధ్యాయుడు పాండు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని జూలూరు, పిలాయిపల్లి, కప్రాయపల్లి, జగత్‌పల్లి, పెద్దగూడెం, పెద్దరావులపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ ఛైర్మన్ అందెల లింగంయాదవ్ బుధవారం ప్రారంభించారు.

వలిగొండ : సంగెం, వర్కట్‌పల్లి, గోకారం, జాలుకాల్వ, నెమలికాల్వ, నర్సాపురం, దుప్పల్లి, వేములకొండ, మునగాలతుర్కపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏపీఎం జానీ ప్రారంభించారు.

చౌటుప్పల్‌గ్రామీణం : దండుమల్కాపురం, అల్లాపురం, ఎనగంటితండా, చిన్నకొండూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయశాఖ భువనగిరి డివిజన్ ఏడీ బి.వెంకటేశ్వర్లు, తహసీల్దార్ హరికృష్ణ ప్రారంభించారు. మండల వ్యవసాయాధికారి ముత్యాల నాగరాజు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ ఛైర్మన్ జక్కిడి జంగారెడ్డి ప్రారంభించారు. ఏఆర్ సురేష్‌నాయక్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

వెంచర్లలో పండ్ల మొక్కలు నాటించండి

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట మండల వ్యాప్తంగా విస్తరించిన స్థిరాస్తి వ్యాపారంతో వన్యప్రాణులకు తీవ్ర ముప్పు వచ్చిందని, నివారించేందుకు వెంచర్లలో పండ్లు, పూల మొక్కలు నాటించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వన్యప్రాణుల సంరక్షణ సమితి కోరింది. బుధవారం యాదగిరిగుట్టలో ఎంపీడీవోకు, మల్లాపురం కార్యదర్శికి వినతిని అందజేశారు. వినతి అందజేసిన వారిలో గౌడ హరిప్రసాద్, కర్రె శ్రీకాంత్, పుచ్చుల జహంగీర్, కర్రె నాగరాజు, బరిగె మల్లేశం, మంగ కరుణాకర్ ఉన్నారు.

'రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా ఛైర్మన్‌పై ఆగ్రహం'

భువనగిరి, న్యూస్‌టుడే: రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా ఛైర్మన్ నియంతృత్వ ధోరణిపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యుడు కొడారి వెంకటేష్ అన్నారు. పట్టణంలోని ఓ హోటల్‌లో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మేనేజ్‌మెంట్ సభ్యులను కనీసం సభకు పరిచయం చేయకపోవడం, జిల్లా ఛైర్మన్ నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, రాష్ట్ర గవర్నర్ దృష్టికి తీసుకెళ్తామని కొడారి వెంకటేష్ తెలిపారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి


కలెక్టరేట్‌ను ముట్టడించిన విద్యార్థులు

భువనగిరి, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ నెల 27న చలో ఇందిరాపార్కు చేపడతామని హెచ్చరించారు. అంతకుముందు కలెక్టరేట్ ముట్టడిలో భాగంగా విద్యార్థులు కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఇరు వర్గాల మధ్య తోపులాట, వాగ్వాదం జరిగింది. పెనుగులాటలో జిల్లా ప్రధాన కార్యదర్శి శాంతికుమార్ చేతికి గాయాలయ్యాయి. కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సూరారం జాని, సహాయ కార్యదర్శి మారపాక లోకేష్, నాయకులు చందు, సాయిచరణ్, ఉదయ్‌కిరణ్, సుమన్, విల్సన్, రజిత, ప్రవళిక, సోనీ, రాజశేఖర్ పాల్గొన్నారు.

సాంకేతిక కోర్సులతో ఉద్యోగావకాశాలు

ఆలేరు, న్యూస్‌టుడే: సాంకేతిక కోర్సులు విజయవంతంగా పూర్తిచేస్తే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉంటాయని ఆలేరు ప్రభుత్వ ఏటీసీ(ఐటీఐ) ప్రిన్సిపల్ జి.హరికృష్ణ అన్నారు. ఏటీసీలో ఖాళీగా ఉన్న కోర్సులలో చేరాలని కోరుతూ బుధవారం ఆలేరు, కొలనుపాకలో ప్రచారం నిర్వహించారు. పదోతరగతి అర్హతతో ఆరు రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఒరిజనల్ సర్టిఫికెట్లతో వస్తే వెంటనే అడ్మిషన్లు ఇవ్వడం జరుగుతుందని, విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగ పర్చు కోవాలన్నారు. శిక్షణ సంస్థ సిబ్బంది శ్రీనివాసులు, సుకృత్‌రెడ్డి, రాజ్‌కుమార్, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

నీటి నాణ్యత పరిశీలించాలి

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: నీటి నాణ్యత విషయంలో రాజీ పడకుండా పరిశీలించిన తర్వాతే సరఫరా చేయాలని జడ్పీ సీఈవో ఎన్.శోభారాణి సూచించారు. యాదగిరిగుట్ట మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ గ్రామ మంచినీటి సహాయకులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించి మాట్లాడారు. వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, శుభ్రం చేస్తూ ఉండాలని సూచించారు. వాల్వ్‌ల వద్ద లీకేజీతో అపరిశుభ్రంగా మారే అవకాశం ఉన్నందున వెంటనే మరమ్మతులు చేయించాలని చెప్పారు. వానకాలంలో మంచినీటిని వేడి చేసుకొని తాగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈ కరుణాకర్, డీఈ అరుణలత, ఎంపీడీవో నవీన్ కుమార్, ఏఈలు ప్రజ్ఞయ, గణేశ్ పాల్గొన్నారు.

సమావేశాన్ని బహిష్కరించి ధర్నా


చౌటుప్పల్‌లో ర్యాలీ చేస్తున్న ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితులు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: ప్రాంతీయ రింగు రోడ్డు నిర్మాణం కోసం భూమిని సేకరించేందుకు అవార్డు విచారణ కోసం తాళ్లసింగారం రైతులతో చౌటుప్పల్ తహసీల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశాన్ని భూనిర్వాసితులు మూకుమ్మడిగా బహిష్కరించారు. భూనిర్వాసితుల జాబితాను విడుదల చేసి వారి నుంచి భూమికి సంబంధించిన పత్రాలు, బ్యాంకు ఖాతా వివరాలు, పాన్ కార్డు ప్రతులను సేకరించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వారంతా సమావేశానికి వచ్చినా విచారణలో పాల్గొనబోమని ప్రకటించి తహసీల్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. తహసీల్దార్ హరికృష్ణకు వినతిపత్రం అందజేశారు. అక్కడ్నుంచి ఊరేగింపుగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించారు. శాస్త్రీయంగా నలభై కిలో మీటర్ల దూరంలో ట్రిపుల్ ఆర్ నిర్మించాలని లేనట్టయితే మార్కెట్ ధర ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని, భూనిర్వాసితులకు జీవనోపాధి కల్పించాలని డీఏవో శ్రీనివాసకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. భూనిర్వాసితుల ఐక్యవేదిక నాయకులు దామోదర్‌రెడ్డి, పెద్దిటి బుచ్చిరెడ్డి, సురేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సందగళ్ల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కూలిన స్తంభం.. తప్పిన ప్రమాదం

మోత్కూరు, న్యూస్‌టుడే: మోత్కూరు పాతబస్టాండ్‌లో బుధవారం రోడ్డు చెంతనున్న విద్యుత్తు స్తంభం కూలి పక్కనున్న ఇంటిమీద పడింది. ఆ సమయంలో సరఫరా ఉన్నప్పటికీ ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోనకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. స్థానికంగా జరుగుతున్న రోడ్డు వెడల్పు, ఇరువైపులా మురుగుకాల్వల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మురుగుకాల్వ కోసం కరెంటు స్తంభం పక్కనుంచే తవ్వి ఉంచారు. దీంతో స్తంభం పునాది బలహీనపడటంతో గాలికి కూలింది. వెంటనే సరఫరాను నిలిపివేసి యంత్రాలను రప్పించి స్తంభాన్ని యథాస్థానంలో నాటారు. సాయంత్రానికి కరెంటు సరఫరా పునరుద్ధరించారు.


ఇంటిమీద పడ్డ కరెంటు స్తంభం

పోలీస్‌స్టేషన్లో భారాస మాజీ ఎంపీ

మోత్కూరు, న్యూస్‌టుడే: రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు బుధవారం ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్తున్న రాజ్యసభ మాజీ సభ్యుడు, సూర్యాపేట భారాస జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్‌ను అక్కడ అరెస్ట్ చేసిన పోలీసులు ఆయనను మోత్కూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక మండల, పట్టణ భారాస అధ్యక్షులు పి.రమేష్, జంగ శ్రీను, రైతుబంధు మండల మాజీ అధ్యక్షుడు కె.సోంమల్లు, మాజీ సర్పంచి బయ్యని పిచ్చయ్య తదితరులు ఆయనను పోలీస్‌స్టేషన్లో కలిశారు.


మోత్కూరు పోలీస్‌స్టేషన్లో బడుగుల లింగయ్య యాదవ్‌తో స్థానిక భారాస నాయకులు

అవీ ఇవీ

చెక్కు అందజేత.. భువనగిరి: జిల్లా సెర్ప్ సంస్థలో ఏపీఎంగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన గంట లింగయ్య కుటుంబానికి సెర్ప్ సంస్థ నుంచి ఎక్స్‌గ్రేషియా అందజేశారు. సెర్ప్ సంస్థ నుంచి రూ.10 లక్షలు, స్త్రీనిధి బ్యాంక్ నుంచి రూ.1.50లక్షల ఎక్స్‌గ్రేషియాను లింగయ్య భార్య సుమలతకు కలెక్టర్ హన్మంత్ కె.జెండగే కలెక్టరేట్‌లో బుధవారం అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో నాగిరెడ్డి, హెచ్ఆర్ ఏపీఎం కవిత, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎన్నిక.. భూదాన్‌పోచంపల్లి: సీపీఎం పట్టణ కార్యదర్శిగా దుబ్బాక జగన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ తెలిపారు.

నూతన కమిటీ నియామకం.. భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా చేనేత జన సమాఖ్య జిల్లా కార్యవర్గం ఎన్నిక రాష్ట్ర అధ్యక్షుడు చింతకింది రమేష్ ఆధ్వర్యంలో జరిగింది. అధ్యక్షుడిగా కర్నాటి పురుషోత్తం, ఉపాధ్యక్షుడిగా రాపోలు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఆటిపాముల మహేందర్, సహాయ కార్యదర్శిగా ఈపూరి విష్ణు, కోశాధికారిగా బింగి భాస్కర్, కార్యవర్గ సభ్యులుగా ఏలె శ్రీనివాస్, గజ్జల రామకృష్ణ, గంజి చంద్రయ్య, కూరపాటి అంజయ్య, ఇమ్మటి ఈశ్వర్, కర్నాటి జనార్దన్, సంగిశెట్టి లక్ష్మీనారాయణ నియామకమయ్యారు.

కార్యదర్శిగా ఎన్నిక.. ఆలేరు: సీపీఎం ఆలేరు పట్టణ కార్యదర్శిగా ఎంఏ ఎక్బాల్ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరో తొమ్మిది మంది సభ్యులతో పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. ఆలేరు పట్టణంలో నెలకొన్న సమస్యలు ప్రాధాన్య క్రమంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరింపజేసేందుకు దృష్టిసారిస్తామని ఎక్బాల్ అన్నారు.

ఉచిత వైద్య శిబిరం.. బొమ్మలరామారం: బొమ్మలరామారంలో ఆయుర్వేదిక్ వైద్యశాల వారి ఆధ్వర్యంలో మండలంలోని జలాల్‌పురం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 129 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి క్రాంతికుమార్, సిబ్బంది లక్ష్మి, ఫరీదా, శంకర్, జ్యోతి, భార్గవి, నవనీత పాల్గొన్నారు.

పరిశ్రమ ఏర్పాటును విరమించుకోవాలి.. చౌటుప్పల్: కొయ్మాయిగూడెంలో కాలుష్య కారకమైన సిమెంటు పరిశ్రమ నిర్మాణాన్ని విరమించుకోవాలని బీఎల్ఎఫ్ రాష్ట్ర ఛైర్మన్ నల్ల సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. బీఎల్ఎఫ్ నాయకుడు నూనె వెంకటస్వామిని పాలకులు పోలీసులతో నిర్బంధించారని ఆయన ఆరోపించారు. చౌటుప్పల్‌లోని మార్కెట్ యార్డులో విలేకరుల సమావేశంలో ఆయన బుధవారం మాట్లాడారు. రామన్నపేట ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటు చేస్తే పంట ఉత్పత్తులు దెబ్బతింటాయన్నారు.

జెండావిష్కరణ.. రామన్నపేట : దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రామన్నపేట, కొమ్మాయిగూడెం గ్రామాల్లో వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ జెండా ఎగురవేసి మాట్లాడారు. హైదరాబాద్‌లో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ పూజలు.. యాదగిరిగుట్ట: యాదాద్రి పుణ్యక్షేత్రాన్ని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి బుధవారం సందర్శించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వాగతం పలికిన పండితులు, పూజారులు వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ ఈవో భాస్కర్‌రావు దేవుడి ప్రసాదం అందజేశారు.

పీఆర్టీయూ అధ్యక్షుడిగా ఎన్నిక.. ఆలేరు: పీఆర్టీయూ-టీఎస్ ఆలేరు మండల అధ్యక్షుడిగా మాదాని జోసెఫ్ బుధవారం ఎన్నికయ్యారు. జోసెఫ్‌ను సంఘం నాయకులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఎ.వేణుగోపాల్, సత్యవతి తదితరులు ఉన్నారు.